క్లుప్తంగా

ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన



అంగన్‌వాడీలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

బిక్కవోలు: ఫోర్టిఫైడ్ రైస్‌పై భారత ఆహార సంస్థ బిక్కవోలు అధికారులు సీహెచ్ శ్రీనివాసు, ఈగా శ్యామసుందరరావు, సతీష్ అవగాహన కల్పించారు. మంగళవారం భారత ఆహార సంస్థ కాకినాడ డివిజనల్ మేనేజర్ విమలాక్ష గౌతమ్ సూచినల మేరకు మండలంలోని ఆర్‌ఎస్‌పేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ అధికారులుమాట్లాడుతూ ఫోర్టి ఫైడ్ రైస్ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఒక కేజీ సాధారణ బియ్యంలో 10 గ్రాములు ఫోర్టి ఫైడ్ రైస్ కలుపుతారని వివరించారు. ఈఫోర్టి ఫైడ్ రైస్‌లో విటమిన్స్, ఐరన్, పోలిక్ ఆసిడ్ మొదలైన సూక్ష్మ పోషకాలు ఉండడంతో రక్త హీనత, నాడీ సంబంధిత వ్యాధులు దూరమవుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలోని ఏజెంట్ శ్రీను, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన ఆలయాలను సందర్శించిన ఎమ్మెల్సీ తోట



బిక్కవోలులో వేద పండితులు ఆశీస్సులు అందుకుంటున్న తోట త్రిమూర్తులు

బిక్కవోలు: స్థానికంగా ఉన్న ప్రాచీన ఆలయాలను ఎమ్మెల్సీ, మండపేట నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు దర్శించుకున్నారు. మంగళవారం ముందుగా బిక్కవోలు శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ కుమార సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీస్సులను అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మినేని నాగ శ్రీనివాసరెడ్డి, ఎఫ్‌సీఐ ఏజెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు

బిక్కవోలు: స్థానిక కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్న సమారధన నిర్వహించారు. అనంతరం స్వామివారి ప్రత్యేక అలంకరణ చేశారు.

2,16,491 మంది ఓటర్లు

రాజానగరం: సవరించిన ఓటరు జాబితాను అనుసరించి నియోజకవర్గంలో 2,16,491 మంది ఓటర్లు నమోదయ్యారని రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. వీరిలో 1,06,879 మంది పురుషులు, 1,09,606 మంది మహిళలు, ఆరుగురు ఇతరులు ఉన్నారన్నారు.

మన్యం వీరుడు అల్లూరికి నివాళి

రాజానగరం: మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు వందో వర్ధంతిని మంగళవారం స్థానిక అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యాలయంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమెక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేడు పెదపూడిలో బళ్లమ్మతల్లి తీర్థం

పెదపూడి: పెదపూడిలోని కొలువై ఉన్న బళ్లమ్మ తల్లి తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించనున్నారని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయం ఎదురుగా ప్రాంగణంలో భక్తులు వేచియుండటానికి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఏ ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

రేపు మహాలక్ష్మి అమ్మవారి తీర్థం



మహాలక్ష్మి అమ్మవారు

పెదపూడి: రామేశ్వరంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించనున్నారని ఆ గ్రామ సర్పంచి కొటికలపూడి చినబాబు తెలిపారు. అమ్మ వారి తీర్థానికి మండల నలుమూల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరవుతారని, అందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. తీర్థం సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించనున్నారన్నారు. బుధవారం రాత్రి గరగ నృత్యాలు, బ్యాండ్ మేళాలు, శక్తి వేషాలు డప్పులు వాయిద్యాలు మొదలగు ప్రదర్శనలు ఏర్పాటు చేశాన్నారు.



కోరుకొండలో హెలిప్యాడ్ వద్దకు తరలివచ్చిన ప్రజలు





మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజా, ఎంపీ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్



జక్కంపూడి విజయలక్ష్మిని ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం జగన్

జన సునామీ

- సీఎం జగన్ సభకు భారీగా తరలివచ్చిన జనం
- కోరుకొండలో కిక్కిరిసిన రోడ్లు
- ఆశీస్సులు అందించిన వరుణుడు



కోరుకొండ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాజానగరం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార సభ జన సునామీని తలపించింది. నియోజకవర్గంలోని పార్టీ కేడర్‌తో పాటు అభిమాన గణం భారీగా తరలిరావడంతో స్వామివారి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారితో పాటు బస్టాండ్ సెంటర్ యావత్తు జనంతో కిక్కిరిసిపోయింది. 2019 ఎన్నికల సమయంలో పోలింగ్ సమయానికి కొద్ది రోజుల ముందు ఇదే ప్రాంతానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి.. అదే సెంటిమెంటుతో ఈసారి కూడా స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా విజ్ఞప్తి మేరకు కోరుకొండలోనే సభను నిర్వహించారు. గడచిన ఐదేళ్లలో జనం కోసం తాను చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ సుమారు అర్ధగంటకు పైగా అనర్గళంగా ప్రసంగించి జనంతో జేజేలు అందుకున్నారు. దేవుడి ఆశీసులుంటే మరోసారి మీకు సేవలందించే భాగ్యాన్ని కోరుకుంటున్నానని, అందుకు మీరంతా ఈ ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓటు చేసి జక్కంపూడి రాజాను ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తిని దేవుడు విన్నాడో ఏమోగాని సభ ముగిసిన తరువాత వరుణుడు ఆశీస్సులు అందించినట్టుగా జల్లులతో జనావళిని ఆహ్లాదపరిచాడు. చేపట్టిన కార్యక్రమం విజయవంతం కావడం, ఆపై వర్షం కురియడంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

ఏకధాటిగా కురిసిన వర్షం

కోరుకొండలో సీఎం జగన్ సభ జరుగుతున్నంత సేపూ ఎండ తీవ్రంగా ఉంది. సభ ముగిసిన కొద్ది సేపటికే మధ్యాహ్నం 12.40 గంటలకు ఆకాశంలో మబ్బులతో వాతావరణం చల్లబడి, చినుకులు ప్రారంభమయ్యాయి. వేసవిలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో పాటు వర్షం సుమారు గంటకు పైగా కురిసింది. కోరుకొండ, రాజానగరం, దివాన్ చెరువు తదితర ప్రాంతాలలో ఏకధాటిగా వర్షం పడింది. రాజానగరంలో గంటపాటు కురిసిన వర్షం 73.3 మి.మీ.గా నమోదయ్యిందంటే వర్షం ఏ మేరకు కురిసిందో అర్థం చేసుకోవచ్చు. దివాన్ చెరువు, పాలచర్ల, శ్రీకృష్ణపట్నం, గాడాల, మధురపూడిలలో భారీ వర్షం పడింది.

పోటెత్తిన జనం

సీతానగరం: ముఖ్యమంత్రి జగన్ హెలికాప్టర్ దిగడానికి ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ప్రజలు పోటెత్తారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఉదయం 10.30 గంటలకే అక్కడకు చేరుకున్నారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ మార్గాని భరత్, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, మేడపాటి షర్మిలారెడ్డి, తోట నరసింహరావు, గ్రంధి శ్రీనివాసరావు, జక్కంపూడి విజయలక్ష్మి, జక్కంపూడి గణేష్ తదితరులు ముఖ్యమంత్రిని సాదరంగా ఆహ్వానించారు. అక్కడి నుంచి కారుపై రోడ్‌షో నిర్వహిస్తూ సభ ప్రాంగణానికి తరలివెళ్లారు. రోడ్డు ఇరువైపులా ప్రజలు బారులు తీరి ఉండటంతో సభ వద్దకు చేరుకోవడానికి సుమారు 40 నిమిషాలు పట్టింది. కోరుకొండలో సభ ముగిసిన అనంతరం ప్రచార బస్సులో సీఎం జగన్‌తో పాటు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి బూరుగుపూడి మీదుగా మధురపూడి విమానాశ్రయానికి వెళ్లారు.

పారదర్శకంగా పాలన

మధురపూడి: ముఖ్యమంత్రి జగన్ రాక ముందు సభా వేదికపై ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఐదేళ్లలో రాజానగరం నియోజకవర్గంలో రూ.1,773 కోట్లతో అభివృద్ధి పనులు, మరో రూ.1,377 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు జరిపామన్నారు. అలాగే 20,170 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పాలన సాగించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ జక్కంపూడి కుటుంబం గురించి మాట్లాడేటప్పుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి హితవు పలికారు. ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన కుమారుడు జక్కంపూడి రాజాను మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న హయాంలో జరిగిన అభివృద్ధి, సాధించిన ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ నక్కా రాంబాబు, మేడా గురుదత్త ప్రసాద్ పాల్గొన్నారు.



మండుటెండలో జగన్ కోసం అభిమానంతో ఎదురు చూస్తున్న ప్రజలు





జగన్‌ను చూడగానే అక్కచెల్లెమ్మల ఆనందం

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- జోరుగా ఎన్నికల ప్రచారం



బొబ్బిల్లంకలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు పలకాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు. మండలంలోని బొబ్బిల్లంక, ములకల్లంక, మిర్తిపాడు, ఉండేశ్వరపురం గ్రామాలలో పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలకు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు బైక్ ర్యాలీగా వెంట వచ్చారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ సీతానగరం మండల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, అందులో భాగంగా రూ.104 కోట్లతో కాతేరు - సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు, సీతానగరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేసి రఘుదేవపురంలో 30 పడకల ఆసుపత్రి నిర్మిస్తున్నామన్నారు. బొబ్బిల్లంకలో రూ.91 కోట్లతో తొర్రిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీమ్ ద్వారా వరద సమయంలో పంట పొలాల ముంపులోకి వెళ్లకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. బొబ్బిల్లంకలో వైద్య అవసరాల కోసం మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తున్నామన్నారు. బొబ్బిల్లంక - ములకల్లంక గ్రామాల మధ్య సుమారు రూ.38 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ చేపడుతున్నామని, ఏడాదిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మెల్లిమి రామచంద్రరావు, మాకాల ఈశ్వరరావు, ఎంపీటీసీలు చిన్ని, మాకిరెడ్డి దేవి, పార్టీ నాయకులు మల్లిన చౌదరి, మొగలపు శ్రీనివాస్, ఏకరాజు, జొన్నలగడ్డ సత్యనారాయణ, మాకిరెడ్డి సాయి కళ్యాణ్, పోతిరెడ్డి వినాయకరావు, నడిపి నరేష్, నల్లా శ్రీను, జొన్నలగడ్డ సత్య పాల్గొన్నారు.

కోరుకొండకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



చినకొండేపూడి నుంచి బయలుదేరిన పార్టీ శ్రేణులు

సీతానగరం: కోరుకొండలో ముఖ్యమంత్రి జగన్ నిర్వహించే సిద్ధం సభకు మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. సీతానగరం నుంచి మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల సర్పంచ్‌ల సంఘు అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, మండల యూత్ అధ్యక్షులు కోలా శ్రీను వెళ్లారు. చినకొండేపూడి నుంచి సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ సత్తి పండురాజు తదితరులు బస్సులో తరలివెళ్లారు.

ఉరుములు, మెరుపులతో వర్షం



మంగళవారం మధ్యాహ్నం వర్షానికి ముందు ఆకాశంలో కమ్ముకున్న మేఘాలు



పందలపాకలో ధాన్యం రాశిపై కప్పిన బరకాలు

- వేసవి నుంచి ఉపశమనం
- మెట్ట భూములకు మేలు

రంగంపేట: వేడవి ఎండలతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు మంగళవారం కురిసిన వర్షంతో ఉపశమనం చెందారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో జనం ఉక్కపోతతో అల్లాడిపోయారు. ఈ సమయంలో వాతావరణం ఒక్కసారిగా ఆకాశంలో మార్పులు చోటు చేసుకొని, అంతా మేఘావతమై కారుమబ్బులు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షం పత్తిచేలు, వరి నారు మడులు వేసే రైతులకు దుక్కులు దున్నుకునేందుకు ఉపయోగపడుతుంది. పామాయిల్ తోటలకు, కర్ర పెండలం మొక్క తోటలకు, కూరగాయ పంటలకు ఈ వర్షం ఉపయోగపడనుంది. మండలంలోని చంద్రేడు, పెదరాయవరం, వడిశలేరు, రంగంపేట గ్రామాలలో పొలాలు దుక్కులకు అనువుగా ఉండగా, కోటపాడు, వెంకటాపురం, సింగంపల్లి, నల్లమిల్లి, దొంతమూరు, వీరంపాలెం గ్రామాలలో కర్ర పెండలం దుంప తోటలు వేయడానికి ఉపయోగపడుతుంది. కాగా వర్షానికి తోడు ఈదురు గాలులు వీచడంతో మామిడి రైతులకు నష్టం వాటిల్లింది.

వాన జోరు.. అన్నదాత బేజారు..

బిక్కవోలు: మండు వేసవిలో వాతావరణం ఉన్నట్లుండి చల్లబడి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు వీస్తూ అకాలవర్షం కురవడంతో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోనేందుకు తీవ్ర ఆగచాట్లు పడాల్సి వచ్చింది. మంగళవారం మండలంలోని అకాల వర్షం కురిసింది. రబీ వరి కోతలు ముమ్మరంగా జరుగుతుండడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు. పనలపై ఉన్న పంటను, ధాన్యం రాశులను బరకాలతో కప్పి ఉంచే పనుల్లో నిమగ్నమయ్యారు.

ఘనంగా సత్యసాయి బాల వికాస్ దినోత్సవం

రంగంపేట: బావితరాలకు ఆధ్యాత్మిక చింతన అలవర్చటంలో కోటపాడు సత్యసాయి సేవా సమితి కార్యక్రమాలు జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తాయని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బలుసు వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని కోటపాడు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్‌నాథ్, నిర్వాహకుడు కందర్ప రాంబాబు మాస్టారు ఆధ్వర్యంలో గత 13 రోజులుగా నిర్వహించిన నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక శిక్షణ తరగతుల ప్రదన్శన, బాల వికాస్ దినోత్సవం, ఈశ్వరమ్మ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ శిబిరంలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టి ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దడానికి తల్లదండ్రులు కృషి చేయాలని, బాల వికాస్ తరగతుల నిర్వహణలో గురువులకు ప్రోత్సాహం ఇవ్వాలని ఆయన కోరారు. స్వర్గీయ వెంకట శ్రీరామమూర్తి మాస్టారు కుటుంబ సభ్యులు స్థానిక సత్యసాయి సేవా సంస్థలలో చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్, వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. ఈ సందర్భంగా బాబా చిత్రపటాన్ని సాయిరథంపై ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సేవాదల్ సమన్వయ కర్త బి. రామలక్ష్మి, వేద అధ్యాయన సమన్వయ కర్త ఆకెళ్ల ప్రసాద్, విద్యా విభాగ సమన్వయ కర్త ఎల్. శ్రీనివాసరాజు, జోనల్ కన్వీనర్ సీహెచ్ త్రిమూర్తులు, భజన మండలి కన్వీనర్లు, బాల వికాస్ గురువులు పాల్గొన్నారు.



కోటపాడులో సత్యసాయి బాల వికాస్ దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న సంస్థ సభ్యులు

స్టేట్ కిక్ బాక్సింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్: విశాఖపట్నంలోని రైల్వే గ్రౌండ్ బాక్సింగ్ హాల్లో ఈ నెల 4, 5వ తేదీల్లో నిర్వహించిన కిక్ బాక్సింగ్ స్టేట్ చాంపియన్‌షిప్, జాతీయ టీమ్ సెలక్షన్స్‌లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాల్గొన్న వారిలో 38 మంది స్వర్ణం, 13 మంది రజతం, 11 మంది కాంస్య పతకాలు సాధించారు. 38 స్వర్ణ పతకాలు సాధించిన జిల్లాకు గ్రాండ్ చాంపియన్‌షిప్ అందజేశారు. ఈ సందర్భంగా కిక్ బాక్సింగ్ ప్రెసిడెంట్ ఎం.గణేష్, వైస్ ప్రెసిడెంట్ బీకే రత్నం, సెక్రటరీ ఎస్.గిరి వెంకటరమణ, కోశాధికారి ఎం.భవానీ శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.అంజనీకుమార్‌లను స్టేట్ ప్రెసిడెంట్ జి.ఆనంద బాలు అభినందించారు.

ఎస్ఈబీ అధికారుల దాడులు

రంగంపేట: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన దాడుల్లో సారా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ ఎస్.రాంబాబు తెలిపారు. వెంకటాపురం గ్రామంలో సారా విక్రయిస్తున్న దంగేటి రాజును అరెస్టు చేసి అతని నుంచి 20 లీటర్ల సారా, దొడ్డిగుంట గ్రామంలో చిల్లబోయిన శ్రీనును అరెస్టు చేసి అతని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామన్నారు.బిక్కవోలు గ్రామంలో అలగోలు రామలక్ష్మిని అరెస్టు చేసి ఆమె నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ జి.అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.



దాడుల్లో మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ అధికారులు

చంద్రబాబుని నమ్మితే పథకాలు గల్లంతే

- అభివృద్ధి, సంక్షేమం కోసం ఫ్యాను గుర్తుకు ఓటేయండి
- జి.మామిడాడలో ఆదిలక్ష్మి ఇంటింటా ఎన్నికల ప్రచారం

పెదపూడి: టీడీపీ అధినేత చంద్రబాబును నమ్మి ఓటేస్తే సంక్షేమ పథకాలు గల్లంతవుతాయని, అభివృద్ధి, సంక్షేమం కోసం అందరు ఫ్యాను గుర్తుకు ఓటేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో మంగళవారం సత్తి ఆదిలక్ష్మి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు గ్రామంలో ప్రతి గడపలో మహిళలు హారతిలిచ్చి, శాలువలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఆదిలక్ష్మి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి వారి ప్రగతికి ప్రతి రూపంగా నిలిచారన్నారు. ముఖ్యమంత్రి జగనన్నది సంక్షేమ పాలన అన్నారు. చంద్రబాబుది జన్మభూమి కమిటీలతో ప్రజలను మోసం చేసే పాలన అని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి ఎమ్మెల్యేగా తన భర్త సత్తి సూర్యనారాయణరెడ్డిని, ఎంపీగా గూడు శ్రీనివాసును అత్యంత భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, అనపర్తి జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతా వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచి లంక మున్ని, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి, పోతుల పద్మిణి, మేడపాటి సుశీల, సంధ్య, పి.కల్యాణి, కుమారి, మంగాదేవి, పడాల చంద్రకళ, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కర్రి వెంకట పద్మావతి, కేతా సత్య శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



జి.మామిడాడలో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఆదిలక్ష్మి

మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకం

సీటీఆర్ఐ: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్లు మరింత బాధ్యతగా, జవాబుదారీతనంతో ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత అన్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో మంగళవారం పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు, పోలింగ్ నిర్వహణ తదితర అంశాలపై సాధారణ ఎన్నికల పరిశీలకులు కె.బాలసుబ్రహ్మణ్యం, కమల్ కాంత్ సరోజ్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ ముందు రోజే కేంద్రాలకు వెళ్లి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జి.నరసింహులు పాల్గొన్నారు.

నోటీసులు జారీ చేయండి

రాజమహేంద్రవరం రూరల్: పోస్టల్ బ్యాలెట్‌కు డబ్బుల పంపిణీపై పత్రికల్లో, వివిధ మాధ్యమాల్లో వచ్చిన వార్తలను గుర్తించి, ఆయా పార్టీలకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. పోలింగ్ రోజు చేయాల్సిన ఏర్పాట్లు, సిబ్బంది మోహరింపు, విస్తరణ, ఓటరు స్లిప్పుల పంపిణీ, నివేదికలు తదితర అంశాలపై మంగళవారం సాయంత్రం వెలగపూడి నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వందశాతం ఓటింగ్ జరిగేలా చూడాలన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం



విద్యుత్ తీగలపై పడిన అట్టల ఫ్యాక్టరీ చిమ్ని

రాజానగరం: వేసవి తీవ్రతతో అల్లాడిపోతున్న జనాలకు మంగళవారం కురిసిన భారీ వర్షంతో వాతావరణం చల్లబడి కాస్త ఊరటనిచ్చింది. ఇదే సమయంలో వీచిన ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి, తీగలు తెగిపడటంతో విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈదురు గాలులకు ఫరిజల్లిపేటకు వెళ్లే రోడ్డులోని అట్టల ఫ్యాక్టరీకి చెందిన చిమ్ని నేలకూలడంతో తీగలు తెగి, పరిసర ప్రాంతాలకు సరఫరా నిలిచిపోయింది. స్థానిక సబ్‌స్టేషన్ ఏఈ సుబ్రహ్మణ్యం, సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని, రాత్రి సమయానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.